సాక్షి
మెదక్
శుక్రవారం । 15 । డిసెంబర్ । 2023





**'పట్టు' సాధిస్తే లాభాలు**

శీతాకాలం వచ్చిందంటే పట్టు పురుగుల పెంపకంలో అనేక జాగ్రత్తలు తీసుకోవాలి. ఈ పెంపకంపై అధికారుల సూచనలు. సలహాలు వారి మాటల్లోనే..

వివరాలు 8లో ▸



**ఫొటోలు ఇక్కడ.. అప్రూవల్ అక్కడ**

వివరాలు 8లో ▸

రవాణా సేవలు ప్రజలకు అందుబాటులో ఉండేందుకు హుస్నాబాద్‌లో మోటార్ వాహన తనిఖీ అధికారి కార్యాలయం ప్రారంభించారు.

**23న జెడ్పీ సర్వసభ్య సమావేశం**

మెదక్ కలెక్టరేట్: జిల్లా ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఈనెల 23న జరుగుతోందని జెడ్పీ సీఈఓ శైలేశ్ గురువారం తెలిపారు. కలెక్టరేట్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు జరిగే ఈ సమావేశానికి జిల్లాలోని అన్ని శాఖల అధికారులు, జెడ్పీటీసీలు సకాలంలో హాజరుకావాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో అన్ని శాఖల్లో నెలకొన్న సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు.

## న్యూస్‌రీల్

### 30 పడకల ఆస్పత్రిని ఏర్పాటు చేయాలి



ఎమ్మెల్యే సంజీవరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్ సత్యనారాయణ

పెద్దశంకరంపేట(మెదక్): మండలకేంద్రంలో 30 పడకల ప్రభుత్వ ఆస్పత్రి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మినీ స్టేడియాన్ని మంజూరు చేయాలని సర్పంచ్ సత్యనారాయణ కోరారు. గురువారం నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డికి వినతి పత్రం సమర్పించారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో సరైన సదుపాయాలు, పడకలు లేవని, రోగులు, ప్రజలు ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారని ఎమ్మెల్యేకు వివరించారు. అలాగే మండల కేంద్రంలోనే మినీ స్టేడియం ఏర్పాటు చేయాలని కోరారు.

### పాఠశాలల సందర్శన



విద్యార్థుల మధ్య కూర్చున్న మానిటరింగ్ కమిటీ సభ్యుడు మహేశ్‌రెడ్డి

చేగుంట(తూప్రాన్): ప్రాథమిక పాఠశాలలను రాష్ట్ర మానిటరింగ్ కమిటీ సభ్యులు గురువారం సందర్శించారు. మండల కేంద్రంలో ఉన్న బాలికల ప్రాథమిక పాఠశాల, సుభాశ్‌నగర్ పాఠశాల, ఇబ్రహీంపూర్, బోనాల్, గోపాల్‌పూర్ ప్రాథమిక పాఠశాలలను పరిశీలించారు. విద్యార్థులు తెలుగుతోపాటు గణితం అంశాల్లో అభ్యాసన పరికరాలతో చదువుకుంటున్న తీరును తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు బోధనా తీరును స్వయంగా పరిశీలించారు. రాష్ట్ర మానిటరింగ్ కమిటీ సభ్యులు మహేశ్‌రెడ్డి, నిహిత్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు నీరజ, అమర్‌శేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌రావ్, ఉపాధ్యాయులు నాగలక్ష్మి, శ్రీనివాస్, స్వరూపరాణి, సంగీత, నర్సింలు తదితరులు ఉన్నారు.

### కక్షిదారులు సత్వరమే కేసులు పరిష్కరించుకోవాలి

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జితేందర్



మాట్లాడుతున్న జితేందర్

మెదక్ కలెక్టరేట్: కక్షిదారులు కేసులను సత్వరమే పరిష్కరించుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జితేందర్ సూచించారు. గురువారం జిల్లా కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మోటార్ వెహికల్ యాక్సిడెంట్ కేసులు, ఇన్సూరెన్స్ కేసులు, భార్యాభర్తల కేసులు, క్రిమినల్ కాంపౌండబుల్ కేసులు, సివిల్ కేసులు, బ్యాంకు రికవరీ కేసులు తదితర కేసులను సత్వర పరిష్కరించుకోవాలన్నారు. ఈనెల 30న కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని తెలిపారు. సదస్సులో ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి రీటా లాల్చంద్, మొబైల్ కోర్టు మేజిస్ట్రేట్ కల్పన, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జెన్నారెడ్డి, బార్ అసోసియేషన్ సెక్రటరీ శ్రీపతి రావు, బార్ అసోసియేషన్ లాయర్లు, ప్యానెల్ లాయర్స్ తదితరులు పాల్గొన్నారు.

### బాలికపై లైంగిక దాడి?

శివ్వంపేట(నర్సాపూర్): బాలికపై లైంగిక దాడి జరిగిందని తల్లి ఆరోపిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె కథనం ప్రకారం.. మండలంలోని చండిలో తల్లిదండ్రులతో కలిసి చిన్నారి ఉంటోంది. గురువారం సాయంత్రం ఆమె తల్లి దుస్తులు ఉతికేందుకుగాను గ్రామ సమీపంలోని బోరుబావి వద్దకు వెళ్లింది. తిరిగొచ్చేసరికి ఇదే గ్రామానికి చెందిన 55 ఏళ్ల వృద్ధుడు ఇంట్లోకి చొరబడ్డాడని ఒంటరిగా ఉన్న చిన్నారిపై లైంగిక దాడి జరిపాడని తల్లి ఆరోపిస్తున్నది. సదరు వ్యక్తిని నిలదీసిన అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### ఆర్టీసీలో అప్రెంటీస్ మేళా

సంగారెడ్డి టౌన్: ఆర్టీసీ మెదక్ రీజియన్ పరిధిలోని 8 డిపోల్లో ఐటీఐ డీజిల్ మెకానిక్ ట్రేడ్‌లో అప్రెంటీస్ శిక్షణ నిర్వహిస్తున్నట్లు మెదక్ రీజియన్ మేనేజర్ ప్రభులత గురువారం తెలిపారు. ఐటీఐ, ట్రేడ్ కోర్స్ పూర్తి చేసిన అభ్యర్థులు తమ ఉత్తీర్ణత వివరాలు www.apprenticeship.india.org వెబ్‌సైట్‌లో ఈనెల 27 లోపు నమోదు చేసుకోవాలని సూచించారు.

# అంగన్‌వాడీల వెట్టిచాకిరీ

**ఏళ్లుగా శ్రమదోపిడీకి గురవుతున్నారు..**

- సమస్యలను పరిష్కరించాలని నూతన ప్రభుత్వానికి విన్నపం

తమ సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీలు నూతన ప్రభుత్వాన్ని కోరుతున్నారు. అంగన్ వాడీ కేంద్రం నిర్వహణ బాధ్యతలు, అనేక శాఖలకు సంబంధించిన అదనపు పనిభారాన్ని మోస్తున్నారు. ఒకటేమిటీ తమకు అప్పగించిన అన్ని రకాల కార్యకలాపాలను సైతం నిర్వర్తిస్తుంటారు. కాగా, ఈ ప్రభుత్వం అయినా తమ డిమాండ్లను నెరవేర్చాలని వారు కోరుతున్నారు.



విద్యాబోధన చేస్తున్న అంగన్‌వాడీ టీచర్

కౌడిపల్లి(నర్సాపూర్): జిల్లాలో మెదక్, నర్సాపూర్, రామాయంపేట, అల్లాదుర్గం నాలుగు ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. ఈ ప్రాజెక్టుల పరిధిలో 1,078 ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో 119 మినీ కేంద్రాలు సైతం ఉన్నాయి. మొత్తం 1,049 మంది టీచర్లు, 1,006 మంది ఆయాలు విధులు నిర్వహిస్తున్నారు.

**పనిభారం**

అంగన్‌వాడీ సెంటర్లు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉంటాయి. కానీ టీచర్ల పని ఆ సమయానికే పరిమితం కావడం లేదు. ఇంటికి వెళ్లాక కూడా గంటలకొద్దీ పని చేయాల్సి వస్తోంది. వీరు రోజంతా సెంటర్ నిర్వహణ, సందర్భాన్ని బట్టి వివిధ శాఖలకు సంబంధించి ఫీల్డ్ వర్క్ చేస్తుంటారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే సరుకులు, గర్భిణులు, బాలింతలు, పిల్లల హాజరుతో పాటు వారికి సరుకులు అందించిన వివరాలు, గృహ సందర్శన తదితర వివరాలన్నీ రిజిస్టర్లలో నమోదు చేస్తారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కొన్నేళ్ల క్రితం స్మార్ట్ ఫోన్లు ఇచ్చింది. పోషణ్ అభియాన్, ఎన్‌హెచ్‌టీఎస్ యాప్‌ల ద్వారా సుమారు 14 రికార్డులకు సంబంధించి ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేశారు. సెంటర్లలో క్షణం తీరిక లేకుండా పని చేస్తుండగా ఇది అదనపు భారంగా మారింది. దీంతో తాము ఇంటి పనులు కూడా చేసుకోలేక పోతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అంగన్‌వాడీ సెంటర్ నిర్వహణ కోసం గత ప్రభుత్వం రూ. 2వేలు ఇచ్చేది. కాగా గ్రామాలు, మండల, జిల్లాకేంద్రంలో అద్దె రూ.4 వేలు ఉంటుంది. మిగతా డబ్బులు సొంతగా జీతంలో నుంచి చెల్లిస్తున్నారు. ఆ అద్దె డబ్బులు సైతం ఆరు నెలలకోసారి ఇచ్చేది. మరోవైపు అంగన్‌వాడీలకు బీఎల్ఓ విధులు అప్పగించి నూతన ఓటర్ల నమోదు, మృతుల తొలగింపు, ఓటరు అవగాహన సదస్సులను నిర్వహించారు. దీంతో వీరు ఓవైపు అంగన్‌వాడీ సెంటర్ల నిర్వహణకు, మరోవైపు ఎన్నికల డ్యూటీని చూసుకోవాల్సి వచ్చింది. ఇలా అన్ని రకాల పనులు చేయించుకుంటున్న గత ప్రభుత్వాలు తమ సంక్షేమం మాత్రం మరిచాయని వాపోతున్నారు. ఇక.. మినీ అంగన్‌వాడీ టీచర్ల పరిస్థితి మరింత ఘోరంగా ఉంది. ఇటు అన్ని రకాలు పనులు చేస్తూ కూడా వంటవండి గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పెట్టాల్సి వస్తోంది. పిల్లలను ఇంటి నుంచి కేంద్రాలకు తీసుకువచ్చి మరలా ఇళ్లకు క్షేమంగా చేర్చడం వీరి పనే. కాగా, గురువారం మంత్రి సీతక్క మినీ అంగన్‌వాడీలను ప్రధాన అంగన్‌వాడీకేంద్రాలుగా మారుస్తూ నిర్ణయం తీసుకున్నారు.

**డిమాండ్లు**

తమకు ఇచ్చే జీతం ఏ మాత్రం సరిపోవడం లేదని, ఉద్యోగ భద్రతకు సంబంధించి ఎలాంటి చర్యలూ ప్రభుత్వం తీసుకోలేదని అంగన్‌వాడీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కొత్తగా ఏర్పడిన కొత్త ప్రభుత్వం తమ గోడును పట్టించుకోవాలని కోరుతున్నారు. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, పీఎఫ్, డీఏ చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. ఉద్యోగ విరమణ వయస్సును 65 నుంచి 60 ఏళ్లకు తగ్గించాలని, రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా బెనిఫిట్లు అందజేయాలని కోరుతున్నారు.

**పనిభారం తగ్గేందుకు చర్యలు**



అంగన్‌వాడీ టీచర్లకు పని భారం తగ్గించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఆన్‌లైన్ నమోదు, రికార్డుల పనిని తగ్గించేందుకు రాష్ట్ర స్థాయిలో కృషి చేస్తున్నది. మిగతా సమస్యల పరిష్కారం కోసం కూడా ఒక నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

–బ్రహ్మాజీ, డీడబ్ల్యూఓ, మెదక్

# రూ. 3.98 లక్షల గోల్‌మాల్

- కొత్తపల్లి పంచాయతీలో బినామీ సంతకంతో నిధుల విత్‌డ్రా
- విచారించిన డీఎల్పీఓ



విచారణ అనంతరం బయటకు వస్తున్న డీఎల్పీఓ

పాపన్నపేట(మెదక్): ఈ గ్రామపంచాయతీలో రూ.3.98 లక్షల నిధుల గోల్‌మాల్ జరిగింది. బినామీ సంతకంతో నిధులు డ్రా చేసినట్లు వచ్చిన ఫిర్యాదుపై గురువారం మెదక్ డీఎల్పీఓ సతీశ్‌కుమార్ విచారణ జరిపారు. కొత్త పల్లి పంచాయతీ.. ఉప సర్పంచ్‌గా బైండ్ల అంజలికి 2022 మార్చి వరకు జాయింట్ చెక్ పవర్ ఉండేది. అప్పట్లో వచ్చిన ఆరోపణల రీత్యా అధికారులు అది కాస్త ఉపసంహరించారు. మరో పంచాయతీ సభ్యుడు సోమశేఖర్‌కు అధికారం అప్పజెప్పారు. మరలా అక్టోబర్ 2022లో అంజలికి తిరిగి జాయింట్ చెక్ పవర్ పునరుద్ధరించారు. అయితే పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్ తన డిజిటల్ సిగ్నేచర్ అప్‌లోడ్ చేయకుండానే సోమశేఖర్ సంతకంతో సుమారు రూ.3.98 లక్షల నిధులు డ్రా చేశారని అంజలి ఆరోపించారు. ఆర్టీఐ కింద దరఖాస్తు చేసుకోగా డిజిటల్ చెక్కులు జనరేట్ చేశారన్న విషయం తెలిసిందన్నారు. అక్రమంగా నిధులు డ్రా చేసిన సర్పంచ్ జగన్నాథాన్ని, కార్యదర్శి రాఘవేందర్ వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు విచారణ జరిపిన డీఎల్పీఓ సతీశ్ కుమార్, ఎంపీఓ లక్ష్మీకాంత్‌రెడ్డి డీపీఓకు నివేదిక సమర్పించనున్నట్లు తెలిపారు.

# ఈకేవైసీ కోసం పడిగాపులు



గ్యాస్ ఏజెన్సీ ఎదుట గుమిగూడిన మహిళలు

మెదక్ కలెక్టరేట్: మెదక్ డివిజన్ పరిధిలోని మహిళలు ఈకేవైసీ కోసం గ్యాస్ ఏజెన్సీల వద్ద పడిగాపులు కాస్తున్నారు. ఈకేవైసీ ఉన్న వారికే కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రూ.500ల సిలిండర్ ఇస్తారని గ్రామాల్లో పుకార్లు వినిపిస్తున్నాయి. మరోవైపు ఈనెలాఖరు వరకే సమయం ఉందని సోషల్ మీడియాల్లో ప్రచారం జరుగుతోంది. దీంతో ప్రభుత్వ పథకం ఎక్కడ తమకు దక్కదోనని ఆందోళనకు గురవుతున్న జనాలు సెంటర్లకు పరుగులు తీస్తున్నారు. దీంతో గ్యాస్ ఏజెన్సీల వద్ద క్యూలైన్లు కనిపిస్తున్నాయి. మెదక్ డివిజన్ పరిధిలో మొత్తం 45 వేల గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో ప్రైవేట్ కనెక్షన్లతోపాటు ఉజ్వల, దీపం పథకానికి సంబంధించిన కనెక్షన్లు ఉన్నాయి. మెదక్ పట్టణంతోపాటు, మెదక్ మండలం, హవేళిఘణాపూర్, రామాయంపేట, నిజాంపేట, కొల్చారం, కౌడిపల్లి, పాపన్నపేట మండలాల లబ్ధిదారులు ఇక్కడ కనెక్షన్లు ఉన్నాయి.

**కనెక్షన్ వాడుతున్నారో.. లేదో తెలుసుకునేందుకే..**

కేంద్రం ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈకేవైసీ నిర్వహిస్తున్నాం. ఈనెలాఖరు వరకు పూర్తి చేయాల్సి ఉంది. భారత్ గ్యాస్ కనెక్షన్లు 31 వేలు ఉన్నాయి. ఇందులో 3 వేలు ఇన్‌యాక్టివ్ ఉండగా 28 వేలు యాక్టివ్‌లో ఉన్నాయి. ఈనెల 8వ తేదీ నుంచి ఈకేవైసీని ప్రారంభించాం. రోజుకు కనీసం 500 వరకు కూడా కావడం లేదు. జనం పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. నెలాఖరు వరకు ఈప్రక్రియ పూర్తి కావడం సాధ్యం కాదు. సమయం పొడిగించే అవకాశం ఉంది. గ్యాస్ కనెక్షన్ పొందిన వారు సక్రమంగా వాడుతున్నారా? లేదా అని తెలుసుకోవడానికే ఈ ప్రక్రియ. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.500కే గ్యాస్ సిలిండర్ పథకానికి ఈ ప్రక్రియకు సంబంధం లేదు. – వెంకట్‌రెడ్డి, భారత్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుడు, మెదక్.

# ప్రత్యేక తరగతులకు ప్రాధాన్యం



ఉద్యోగ విరమణ చేస్తున్న అటెండర్‌ను సన్మానిస్తున్న సత్యనారాయణ

**జిల్లా ఇంటర్ విద్యాధికారి సత్యనారాయణ**

అల్లాదుర్గం(మెదక్): ఇంటర్మీడియట్‌లో ఉత్తమ ఫలితాల సాధనకు అధ్యాపకులు కృషి చేయాలని, విద్యార్థులకు ప్రత్యేక తరగతులు సైతం నిర్వహించాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి సత్యనారాయణ సూచించారు. గురువారం స్థానిక జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అటెండర్ పీరమ్మ పదవీ విరమణ పొందగా ఆయన సన్మానించారు. కాలేజీలో రికార్డులను పరిశీలించి సంతృప్తిని వ్యక్తపరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వార్షిక పరీక్షలు దగ్గర పడుతున్నాయని విద్యార్థులు చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. క్రమపద్ధతి ద్వారా స్టడీ అవర్స్ నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ శ్యామ్‌రావు, అధ్యాపకులు రవికుమార్, రవీందర్, నరసింహారెడ్డి, శివకుమార్ నరసింహులు, శ్రీకాంత్, రమేశ్, గీత, విద్యార్థులు, నాన్ టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## సీపీఎస్ రద్దు చేయండి

కోహీర్(జహీరాబాద్): సీపీఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు సాయిలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సభ్యత్వ నమోదులో భాగంగా కొత్తూర్(కె), ఖానాపూర్, బిలాల్‌పూర్, మనియార్‌పల్లి, బడంపేట, గొడిగార్‌పల్లి గ్రామాల్లో గురువారం ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారు.

# రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి



గన్యా



శ్రీకాంత్

**ముగ్గురికి గాయాలు**

చేగుంట(తూప్రాన్): రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతిచెందారు. ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ సంఘటనలు మండలకేంద్రంలో గురువారం రాత్రి చోటు చేసుకున్నాయి. ఎస్ఐ హరీశ్ తెలిపిన వివరాల ప్రకారం.. శివ్వంపేట మండలం చండి గ్రామ పంచాయతీ సర్వన్ తండాకు చెందిన నెనావత్ గన్యా(40), లలిత ఇద్దరూ బైక్‌పై వెళ్తున్నారు. రెడ్డిపల్లి బ్రిడ్జి వద్ద రాంగ్ రూట్‌లో వెళ్తుతుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. దీంతో గన్యా తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. లలితకు గాయాలయ్యాయి.

**చిన్నశివునూరులో..**

రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతిచెందారు. మండలంలోని చిన్నశివునూర్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. గ్రామం నుంచి పెద్దశివునూర్‌కు బైక్ పై తలారి శ్రీకాంత్ బయలుదేరారు. పెద్దశివునూర్ నుంచి చిన్నశివునూర్ వైపునకు మరో బైక్ వస్తున్నది. ఈ రెండూ చిన్నశివునూర్ మలుపు వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో శ్రీకాంత్‌కు తీవ్రగాయాలయ్యాయి. కాగా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు.

**ఇద్దరికి గాయాలు**

లారీ వెనుక నుంచి ఢీకొన్న ఘటనలో ఇద్దరు మహిళలకు గాయాలయ్యాయి. ఈ ఘటన చేగుంటలో చోటుచేసుకుంది. పెద్దశివునూర్‌కు చెందిన యశోద, జ్యోతి ఇద్దరూ షాపింగ్ చేసేందుకు మండలకేంద్రానికి వచ్చారు. గాంధీ చౌరస్తా వద్ద నడుచుకుంటూ వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొంది. ఈ ఘటనలో వారు గాయపడ్డారు. క్షతగాత్రులను వెంటనే ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

# లక్ష సాయం అందేనా?

- జిల్లా వ్యాప్తంగా 21,480 దరఖాస్తులు
- 15,227 మంది అర్హులుగా గుర్తింపు

సాక్షి, సిద్దిపేట: బీసీ కులవృత్తుల వారికి చేయూతనిచ్చేందుకు అందించే లక్ష రూపాయల ఆర్థిక సాయం వస్తుందా? రాదా? అనే అయోమయంలో వారంతా ఉన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా జూన్ 9న సంక్షేమ దినోత్సవం సందర్భంగా బీసీ కులవృత్తుల వారికి ఆర్థిక సాయం కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా జూన్ 20 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా 21,480 మంది దరఖాస్తు చేయగా అందులో ఇప్పటి వరకు 2,891 మంది ఒక్కొక్కరికీ రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం అందించారు.

**పెండింగ్‌లో 12,336 దరఖాస్తులు**

జిల్లా వ్యాప్తంగా 21, 480 దరఖాస్తులు అందగా ఎంపీడీఓలు గ్రామాల వారీగా, పట్టణాల్లో మున్సిపల్ కమిషనర్‌లు వార్డుల వారీగా దరఖాస్తులను వేరు చేశారు. గ్రామాల వారీగా క్షేత్రస్థాయిలో పంచాయతీ కార్యదర్శులు, పట్టణాల్లో మున్సిపల్ సిబ్బంది దరఖాస్తులను పరిశీలించారు. కుల వృత్తులకు సంబంధించిన పనుల కోసమే దరఖాస్తు చేశారా అని క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అందులో 15,227 మందిని అర్హులుగా తేల్చారు. దశల వారీగా అర్హులకు సాయం డబ్బులను అందించారు. ఇప్పటి వరకు 2,891 మందికి సాయం అందించారు. ఇంకా 12,336 మంది అర్హులకు పెండింగ్‌లో ఉంది.




పథకం కొనసాగేనా...

గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన ఈ సాయం పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందా? మళ్లీ కొత్తగా ఏమైనా పథకం రూపొందిస్తుందా? అని దరఖాస్తుదారులు ఆందోళన చెందుతున్నారు. ఆర్థిక సాయం దరఖాస్తు చేసుకునేందుకు కులం, ఆదాయం సర్టిఫికెట్ల కోసం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దరఖాస్తు చేసిన తర్వాత ఎంక్వైరీ పూర్తయి అర్హులుగా ఎంపికైనా సాయం రాకపోవడంతో తీవ్ర నిరాశలో ఉన్నారు. నూతనంగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఈ ఆర్థిక సాయాన్ని ముందుగా దరఖాస్తు చేసుకున్న వారికే అందించాలని కోరుతున్నారు.

**ఆదేశాలు వచ్చాకే సాయం**

రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చే ఆదేశాల ప్రకారం కుల వృత్తుదారులకు ఆర్థిక సాయం అందిస్తాం. ఎన్నికలకు ముందు కేటాయించిన బడ్జెట్ మేరకు రూ.లక్ష సాయం అందించాం. గతంలో తీసుకున్న దరఖాస్తులన్నీ ఉన్నాయి.

– సరోజ, జిల్లా బీసీ సంక్షేమ అధికారి

# పెండింగ్‌లో బిల్లులు .. గుండెల్లో గుబులు

- ఐదు మండలాల పరిధిలో బకాయిలు రూ.30 కోట్లు
- సర్పంచ్‌ల్లో ఆందోళన
- వచ్చేనెలతో ముగియనున్న పదవీకాలం



రామాయంపేటలో అసంపూర్తిగా దర్శనమిస్తున్న దుకాణ సముదాయం

రామాయంపేట(మెదక్): ప్రభుత్వం మారడంతో అభివృద్ధి పనులకు సంబంధించి బిల్లుల మంజూరు కథ మొదటికొచ్చింది. రామాయంపేట సబ్ ట్రెజరీ పరిధిలోని ఐదు మండలాల్లో సుమారుగా రూ. 30 కోట్లమేర బిల్లులు ఆగిపోగా చాలా వరకు పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. కేవలం రాయాయంపేట మున్సిపాలిటీ పరిధిలోనే రూ. పది కోట్ల నిధులు మంజూరు కావాల్సి ఉంది. అందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. రామాయంపేట సబ్‌ట్రెజరీ పరిధిలో నిజాంపేట, రామాయంపేట, నార్సింగి, చేగుంట, చిన్నశంకరంపేట మండలాలున్నాయి. ఈ మండలాల సర్పంచ్‌లు, కంట్రాక్టర్లు పలు రకాల పనులు చేపట్టారు. అవి పూర్తయి ఏడాది గడుస్తున్నది. ఇప్పటివరకు కూడా నిధులు మంజూరు కాలేదు. ప్రభుత్వం మారడంతో వీరిలో ఆందోళన మొదలైంది. గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన శ్మశాన వాటికల నిర్మాణాలు, మన ఊరు– మన బడి పథకం కింద ఆయా పాఠశాలల్లో తరగతి గదులు, మరుగుదొడ్లు, ప్రహరీల నిర్మాణాలు చేపట్టారు. విడతల వారీగా నిధులు మంజూరు అవుతున్నాయి. అయితే ఇంకా చాలా పనులకు నిధులు విడుదల కావాల్సి ఉంది. వచ్చేనెలలో తమ పదవీ కాలం పూర్తవుతోందని ప్రజాప్రతినిధుల్లో ఆందోళన నెలకొంది. కనీసం తాము ఖర్చు చేసిన నిధులైనా ఇవ్వాలని వారు కోరుతున్నారు. ప్రస్తుతం కేంద్రం నుంచి పంచాయతీలకు మంజూరవుతున్న అరకొర నిధులు ట్రాక్టర్ల వాయిదాలు, వర్కర్ల వేతనాలు, ట్రాక్టర్ల డీజిల్ ఖర్చులకు కూడా సరిపోవడం లేదని వారు వాపోయారు. అలాగే ఎన్నికల దృష్ట్యా గ్రామాల్లో ఆయా సంఘాలకు సంబంధించి కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలూ పనులు చేపట్టారు. అధికారికంగా మంజూరు లేదు. అయినా నిర్మాణాలు ప్రారంభించారు. ఇప్పుడివీ నిలిచిపోయాయి. గ్రామాల్లో వారు అప్పులు చేసి పనులు చేయగా, కొన్ని చోట్ల పనులు పూర్తయినా బిల్లుల చెల్లింపు ఇబ్బందికరంగా మారింది. ఎంబీ (కొలతల పుస్తకం) రాయడం పూర్తయి ఎస్టీఓ(సబ్ ట్రెజరీ)లో సబ్‌మిట్ చేసిన వాటికి సంబంధించి సుమారుగా మూడు కోట్లమేర నిధులు రావాల్సి ఉంది. ఇవే కాకుండా పనులు పూర్తయి ఎంబీ రాయకుండా ఉన్నవి పెద్ద మొత్తంలో పెండింగులో ఉన్నాయని పంచాయత్‌రాజ్‌శాఖ అధికారి ఒకరు తెలిపారు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు వస్తే తప్ప బిల్లుల మంజూరుపై ఇప్పుడేమీ చేయలేమని నిస్సహాయత వ్యక్తం చేశారు.

**బిల్లులు రాలేదు..**



కొత్త ప్రభుత్వం పంచాయతీల అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించాలి. తాము అప్పులు చేసి మరీ పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు నిర్వహించాం. అయినా కానీ బిల్లులు ఇంకా విడుదల కాలేదు. ఒక్కో సర్పంచ్‌కు రూ. పది లక్షల వరకు బిల్లులు రావాల్సి ఉంది. సర్పంచ్‌ల ఆర్థిక పరిస్థితి ఎంత మాత్రం బాగా లేదు. ప్రభుత్వం ఆదుకోవాలి.

– మహేందర్‌రెడ్డి, సర్పంచ్, ఆర్ వెంకటాపూర్

## క్లుప్తంగా

### జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక



అక్షయ

దుబ్బాక: జాతీయ స్థాయి ఎస్‌జీఎఫ్ వాలీబాల్ పోటీలకు దుబ్బాక మున్సిపల్ పరిధిలోని ధర్మాజీపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన అక్షయ ఎంపికైనట్లు పాఠశాల పీఈటీ నరేశ్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న కర్నాల అక్షయ అక్టోబర్ నెలలో మహబూబ్ నగర్‌లో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్ 17 రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబర్చింది. ఈ నెల 25వ తేదీ నుండి తమిళనాడు రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయి వాలీబాల్ పోటీల్లో రాష్ట్ర ప్రభుత్వం తరఫున పాల్గొనున్నట్లు పేర్కొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, సిబ్బంది ఆమెను అభినందించారు.

### రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌కు..



మొదటి బహుమతి అందుకుంటున్న విద్యార్థులు

హత్నూర( సంగారెడ్డి): మండల కేంద్రమైన హత్నూర గురుకుల పాఠశాల, కళాశాలకు చెందిన విద్యార్థులు ఇటీవల నిర్వహించిన జోనల్ స్థాయి సైన్స్ ఫెయిర్‌లో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సుధాకర్ గురువారం తెలిపారు. ఈనెల 11 ,12 ,13 తేదీల్లో వర్గల్పేట గురుకుల పాఠశాలలో జరిగిన జోనల్ స్థాయి విద్యా విజ్ఞాన ప్రదర్శనలో పనికిరాని ప్లాస్టిక్ ముడి సరుకుతో పెట్రోల్ తయారీ విధానంపై సైన్స్ ఉపాధ్యాయులు సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులు ఉజ్వల్ జయంత్, విశాల్ రాజ్ డెమో చేసినట్లు తెలిపారు. ఇందుకు మొదటి బహుమతితోపాటు రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌కు ఎంపికైనట్లు పేర్కొన్నారు.

### రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు..



క్రికెట్ పోటీలకు ఎంపికైన స్టాలిన్

జహీరాబాద్: గద్వాల్‌లో నేటి నుంచి జరగనున్న రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్ పోటీలకు మండల కేంద్రమైన మొగుడంపల్లికి చెందిన బాలుడు ఎంపికయ్యాడు. ఎస్‌జీఎఫ్ అండర్-19 స్థాయి పోటీలకు స్టాలిన్ ఎంపికైనట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. సిద్దిపేటలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటాడు. దీనిపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

### ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

సదాశివపేట(సంగారెడ్డి): సంగారెడ్డిలో గల మైనార్టీ గురుకుల పాఠశాలల్లో పీజీటీ, సోషల్, టీజీటీ, గణితం, డిప్యూటీ వార్డెన్ పోస్టులకు అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నామని రీజినల్ లెవెల్ కోఆర్డినేటర్ డాక్టర్ డి.నర్సింలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. టీచర్ పోస్టులకు సంబంధిత సబ్జెక్ట్‌లో పీజీ, బీఎడ్, డిప్యూటీ వార్డెన్ పోస్టుకు డిగ్రీ, బీఎడ్ అర్హత ఉండాలని సూచించారు, దరఖాస్తులను ఈనెల 16వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు రీజినల్ లెవెల్, కో ఆర్డినేటర్, ఆఫీస్ సంగారెడ్డి కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు ఆఫీసులోగాని, 76739 17990 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

# పట్టు సాధిస్తే లాభాలే..

- చాకి పురుగుల పెంపకంలో మెలకువలు తప్పనిసరి
- కేంద్రాల వల్ల ఎన్నో అనుకూలతలు
- కీలకం కానున్న ఆకు నాణ్యత
- పరిశ్రమ శాఖ అధికారుల సూచనలు, సలహాలు



చాకిల పెంపకంపై రైతులకు సూచనలిస్తున్న అధికారి



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): శీతాకాలం వచ్చిందంటే పట్టు పురుగుల పెంపకంలో అనేక జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా చలికాలంలో వీచే బలమైనటువంటి శీతల గాలులతో మొదటి దశలో ఉన్న పట్టు పురుగులకు (చాకి) 28 డిగ్రీల నుంచి 29 డిగ్రీల వరకు ఉష్ణోగ్రత ఉండే గదులను కేటాయించుకోవాలని పట్టు పరిశ్రమశాఖ అధికారులు సూచిస్తున్నారు. పట్టుపురుగు పెంపకంపై అధికారుల సూచనలు. సలహాలు వారి మాటల్లోనే..

◆ జిల్లాలో కనిష్ట ఉష్ణోగ్రతలు 12 డిగ్రీల వరకు నమోదు అవుతున్నాయి. చలి తీవ్రత ఎక్కువగా ఉంటే చాకి పురుగులు తట్టుకోలేవు. అందుకోసం ప్రతి రోజూ ఉదయం నుంచి సాయంత్రం వరకు గదిలో వెలుతురు ఉండేటట్లు చర్యలు తీసుకోవాలి.

◆ గదిలోకి సూర్యరశ్మి ప్రవేశించేలా చర్యలు చేపట్టాలి. పట్టు పురుగులు సాధారణంగా తక్కువ కాంతిని ఇష్టపడతాయి. కావున ఎక్కువ వెలుతురునిచ్చే హైవోల్టేజ్ బల్బులను వాడొద్దు.

◆ చాకి కేంద్రాల వల్ల రైతులు ఉష్ణోగ్రతను, తేమను అదుపులో ఉంచే విధంగా అవకాశం ఉంటుంది. శ్రమ, ఖర్చు తగ్గుతుంది.

◆ గదుల్లో చిన్న సైజు పట్టు పురుగులను పెంచాలి. ఉష్ణోగ్రత సమతాస్థాయిలో ఉంచడానికి హీటర్స్, హ్యుమిడి ఫైయర్‌లను ఉపయోగించాలి.

◆ లేత మల్బరి ఆకు మాత్రమే చాకిలకు ఇవ్వాలి. ప్రతి రోజూ మేత వేసే ముందు ట్రేలను శుభ్రపర్చాలి.

**ఆకు నాణ్యత తప్పనిసరి..**

చాకి మేతకు ఉపయోగించే ఆకు మొదటి సారి మల్బరి లేత ఆకును మాత్రమే ఇవ్వాలి. ఆకులో మంచి పోషక విలువలు ఉండేలా సేంద్రియ సాగులో పండించిన మల్బరి ఆకును మాత్రమే వినియోగించాలి. నీడలో పెరిగిన చెట్ల ఆకులు, మురికి అంటిన ఆకులు, నీటిలో తడిసిన ఆకులు మేతగా వేయవద్దు. మల్బరి తోట నాటినప్పటి నుంచి 45 రోజుల వరకు గల ఆకులను చాకి మేతగా వేయాలి. ఈ మేత వల్ల చాకిలు అత్యధికంగా రోగ నిరోధక శక్తిని కల్గి ఉంటాయి. చాకి పురుగులు నీటిని కేవలం ఆకుల నుంచి మాత్రమే గ్రహిస్తాయి. అందువల్ల ఆకు నాణ్యత ప్రముఖ పాత్ర పోషిస్తాయని పరిశ్రమశాఖ అధికారులు సూచిస్తున్నారు.

| దశ | ఆకు పరిమాణం | ఇవ్వాల్సిన స్థలం (చ.అడుగుల్లో) |
|---|---|---|
| మొదటిది | 4-6 కిలోలు | 414 - 620 |
| రెండవది | 11-16 కిలోలు | 1,445-2,065 |

| అనుకూలమైనవెలుతురు.. | |
|---|---|
| గుడ్డు దశ | 6 గంటల వెలుతురు, 18 గంటల చీకటి |
| పెద్ద పురుగు దశ | 18 గంటల వెలుతురు, 6 గంటల చీకటి |

**మొదటి దశ కీలకం**



పట్టు పురుగుల పెంపకంతో రైతులు అధిక లాభాలు ఆర్జించవచ్చు. పట్టు పురుగుల పెంపకంలో మొదటి దశ కీలకం. శీతల గాలులతో చాకి పురుగులపై తీవ్ర ప్రభావం ఉంటుంది. వెలుతురు, ఉష్ణోగ్రత అందేలా గది విస్తీర్ణం అనుకూలంగా తయారు చేయాలి. ఈ దశలోనే పట్టు పురుగు ఎదుగుదల, ఆకు నాణ్యత ఆధారపడి ఉంటుంది. చాకి పెంపకంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి.

– ఇంద్రసేనారెడ్డి, సిద్దిపేట పట్టు పరిశ్రమ శాఖ అధికారి

# గజ్వేల్ ప్రజలకు రుణపడి ఉంటా

మాజీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్



మాట్లాడుతున్న ఈటల రాజేందర్

వర్గల్(గజ్వేల్): బీఆర్‌ఎస్ నాయకుల ప్రలోభాలకు తలొగ్గకుండా తనపై నమ్మకంతో ఓటేసిన గజ్వేల్ నియోజకవర్గ ప్రజలకు ఎల్లవేళలా రుణపడి ఉంటానని హుజురాబాద్ మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత ఈటల రాజేందర్ అన్నారు. గురువారం వర్గల్ మండలం గౌరారం ఫంక్షన్ హాల్‌లో వర్గల్, ములుగు మండలాల ముఖ్య కార్యకర్తల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ.. తనను ఓడించడమే లక్ష్యంగా బీఆర్‌ఎస్ నాయకులు డబ్బులు పంచి, మద్యాన్ని ఏరులై పారించారని పేర్కొన్నారు. ప్రజలు వారి మాటలు విశ్వసించలేదని, కేసీఆర్‌ను తట్టుకునే సత్తా ఈటల రాజేందర్‌కే ఉందని నమ్మి తనను ఆదరించారని స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు నందన్‌గౌడ్, టేకులపల్లి రాంరెడ్డి, గాడిపల్లి భాస్కర్, సురేశ్ గౌడ్, జశ్వంత్‌రెడ్డి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

**మేనిఫెస్టోతో అధికారంలోకి రాలేదు**

జగదేవ్‌పూర్(గజ్వేల్): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం తమ మేనిఫెస్టోతో అధికారంలోకి రాలేదని, తప్పుడు ప్రచారం మైండ్‌గేమ్‌తో అధికారంలోకి వచ్చారని ఈటల రాజేందర్ అన్నారు. గురువారం జగదేవ్‌పూర్, మర్కూక్ మండలాల బీజేపీ ముఖ్య నాయకులతో జగదేవ్‌పూర్‌లోని ఎస్వీ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గజ్వేల్‌లో నా ఓటమి రేపటి గెలుపు నాంది అని తెలిపారు. కాంగ్రెస్ నేతలు బీజేపీ, బీఆర్‌ఎస్ ఒక్కటేనని, తప్పుడు ప్రచారం, మైండ్ గేమ్‌తో ప్రజలను మభ్య పెట్టి అధికారంలోకి వచ్చారని ఆరోపించారు. జగదేవ్‌పూర్, వట్టిపల్లి, గొల్లపల్లి, అంగడి కిష్టాపూర్ గ్రామాలకు చెందిన 30 మంది బీఆర్‌ఎస్ నాయకులు బీజేపీలో చేరారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ నాయకులు భాస్కర్, సత్తయ్య, రాములు, సురేశ్, సాయిబాబా, మల్లేశం కరుణాకర్‌రెడ్డి, గణేశ్, రమేశ్ గుప్త, రాంరెడ్డి, జశ్వంత్‌రెడ్డి, శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

# దత్తత పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి

సంగారెడ్డి టౌన్ : దత్తతకు అర్హత కలిగిన పిల్లల వివరాలు దత్తత పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని డీడబ్ల్యూఓ సంధ్యారాణి అన్నారు. గురువారం సంగారెడ్డి జిల్లాలోని మహిళా ప్రాంగణంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ సంగారెడ్డి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని 12 బాలల శిశు సంరక్షణ కేంద్రాలకు దత్తత పైన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీడబ్ల్యూఓ మాట్లాడుతూ.. శిశు సంరక్షణ కేంద్రాల సిబ్బంది వారి వద్ద ఉన్న పిల్లల వివరాలు దగ్గర పెట్టుకోవాలన్నారు. అందరూ జువైనల్ జస్టిస్ యాక్ట్ 2021 ప్రకారం శిశు సంరక్షణ కేంద్రాలు నడపాలన్నారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ రాజారెడ్డి మాట్లాడుతూ.. బాలల న్యాయ చట్టం ప్రకారం ప్రతీ పిల్లవాడి వివరాలు సీఏఆర్ఏ వెబ్‌సైట్ ఆన్‌లైన్‌లో ఉండాలన్నారు. సంగారెడ్డిలోని డీపీఐఈయూ యూనిట్ బాగా పని చేస్తుందన్నారు. కొద్ది రోజుల కిందట తప్పిపోయిన నలుగురు బాలికలను తల్లితండ్రులకు అప్పగించామన్నారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ సభ్యులు విష్ణుమూర్తి, మెదక్ సభ్యులు ఉప్పలయ్య, డీసీపీఓ రత్నం, కర్ణ శీల, లింగం పాల్గొన్నారు.

# పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి



సభ్యత్వం నమోదు చేసుకుంటున్న ఉపాధ్యాయులు

టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కనకయ్య

సిద్దిపేటరూరల్: ఉద్యోగ ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న బిల్లులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కనకయ్య, జిల్లా అధ్యక్షుడు విజయేందర్‌రెడ్డి అన్నారు. నారాయణరావుపేట టీపీటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో వివిధ పాఠశాలల్లో సభ్యత్వ నమోదు, సమస్యల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు, డీఏలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రాథమిక పాఠశాలలో ఎఫ్ఎల్ఎన్, ఉన్నత పాఠశాలలో ఉన్నతి ప్రోగ్రామ్ వల్ల ఉపాధ్యాయులకు పేపర్ వర్క్‌తో తరగతి గదిలో బోధనకు ఆటంకం కలుగుతుందన్నారు. ప్రభుత్వం ఈ ప్రోగ్రామ్‌లపై మరోసారి ఆలోచించాలన్నారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ సీనియర్ నాయకులు, డీసీఈబీ అధికారి, జక్కాపూర్ ప్రధాన ఉపాధ్యాయులు షౌకత్ అలీ, నాగరాజు, మండల అధ్యక్షుడు వెంకటేశం, ప్రధాన కార్యదర్శి మనోహర్, పీ. ఎల్లం, రాజేశ్వరి, స్వరూప, పద్మ, లలిత భవానీ, అశోక్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# కువైట్‌లో మెదక్ జిల్లావాసి మృతి



బాబు (ఫైల్)

నిజాంపేట(మెదక్):బతుకుదెరువు నిమిత్తం కువైట్ వెళ్లిన మెదక్ జిల్లా వాసి మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. నిజాంపేట మండలం నందిగామకు చెందిన పాపయ్యగారి బాబు (30) ఆరేళ్ల క్రితం కువైట్ వెళ్లాడు. రెండేళ్ల క్రితం స్వగ్రామానికి వచ్చి వెళ్లాడు. కువైట్‌లోని సుభువై ఇండస్ట్రియల్ ఏరియాలో ఉన్న కోకా కోలా కంపెనీలో పని చేస్తున్నాడు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతుండగా సోమవారం తాను నివాసం ఉండే గదిలోని బాత్‌రూంలో ప్రమాదవశాత్తు కాలు జారి పడిపోయి సొమ్మసిల్లాడు. రెండు మూడు గంటల తర్వాత డ్యూటీ నుంచి వచ్చిన అతడి స్నేహితులు బాబును గమనించి చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందినట్లు నందిగామలోని ఆయన కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. బాబుకు భార్య నవిత, ముగ్గురు సంతానం ఉన్నారు.



విలపిస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు

**మేము ఎలా బతికేది..**

రామాయంపేట (మెదక్): కువైట్‌లో బాబు మరణించగా.. మేము ఇప్పుడెలా బతికేదని కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతరమవుతున్నారు. అతడికి వృద్ధురాలైన తల్లిని, భార్య నవిత, ఆరేళ్ల లోపు ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఉన్న ఎకరం వ్యవసాయ భూమిలో నీరు లేక పంటలు పండడం లేదు. కుటుంబం గడవటమే కష్టతరంగా మారడంతో అప్పులు చేశాడు. అక్కడే ఓ కంపెనీలో పని చేస్తూ అప్పులు తీర్చాడు. అతడిపైనే ఆధారపడ్డ కుటుంబ సభ్యులు ఇప్పుడు మాకు దిక్కెవరని రోదించడం అందరినీ కలిచివేసింది.

# ఫొటోలు ఇక్కడ.. అప్రూవల్ అక్కడ

- హుస్నాబాద్ ఎంవీఐ కార్యాలయంలో అరకొర సేవలు
- అన్నింటికీ జిల్లా కేంద్రానికి వెళ్లాల్సిందే..
- కోడ్ నంబర్ కేటాయించక వాహనదారుల ఇబ్బందులు
- లైసెన్స్ కార్డుల జారీలోనూ జాప్యం..
- కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు



హుస్నాబాద్ పట్టణంలోని ఎంవీఐ అధికారి కార్యాలయం

హుస్నాబాద్: రవాణా సేవలు ప్రజలకు అందుబాటులో ఉండేందుకు హుస్నాబాద్‌లో మోటార్ వాహన తనిఖీ అధికారి కార్యాలయం ప్రారంభించారు. అయినా కూడా ఇక్కడ వాహనదారులకు పూర్తిస్థాయిలో సేవలు అందడం లేదు. కేవలం ఒకటి, రెండు సేవలు ఇక్కడ అందించి, మిగితా వాటికి సిద్దిపేటకు పంపిస్తున్నారు. ఏదైనా వాహనానికి సంబంధించి పని కోసం ఫొటో ఇక్కడ దిగినా.. అప్రూవల్ మాత్రం సిద్దిపేట నుంచి చేస్తున్నారు. దీంతో వాహనదారులు అటూ, ఇటూ తిరగలేక ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

హుస్నాబాద్ పట్టణంలో 2017 డిసెంబర్‌లో మోటార్ వాహన తనిఖీ కార్యాలయం ప్రారంభించారు. అప్పటి నుంచి ఈ కార్యాలయంలో కొత్త లైసెన్స్‌లు, ఫిట్‌నెస్, వాహనాల కొత్త రిజిస్ట్రేషన్ల సేవలు మాత్రమే అందిస్తున్నారు. మిగితా సేవలైన డ్రైవింగ్ లైసెన్స్ రెన్యూవల్, డూప్లికేట్ లైసెన్స్, ద్విచక్ర వాహనాలు, కార్లకు సంబంధించి ట్రాన్స్‌ఫర్ కావాలంటే వాహనదారుల ఫొటోలు ఇక్కడ తీసి అప్రూవల్ కోసం జిల్లా కేంద్రంలోని యూనిట్ ఆఫీస్‌కు పంపిస్తున్నారు. ట్రాన్స్‌పోర్ట్ వర్క్‌కు సంబంధించి లారీల పర్మిట్లు, ట్రాన్స్‌ఫర్స్, లైసెన్స్‌ల బ్యాడ్జీ నంబర్, వెహికిల్ పై ఉన్న ఫైనాన్స్ తొలగింపు, డూప్లికేట్ ఆర్‌సీ, రెన్యూవల్ ఆర్సీ, ఆర్‌సీలో అడ్రస్ మార్పు, ఒక జిల్లా నుంచి మరో జిల్లాకు వాహనం బదిలీకి ఎన్‌ఓసీ సర్టిఫికెట్ వంటి సేవలు ఉన్నాయి. ఈ సేవలన్నింటికీ సంబంధించి పత్రాలను హుస్నాబాద్‌లో పరిశీలించి ఫొటోలు దింపుతున్నారు. కానీ అప్రూవల్ కోసం మాత్రం జిల్లా కేంద్రానికి వెళ్లాలని చెబుతున్నారు.

**కోడ్ నంబర్ కేటాయించకనే..**

సిద్దిపేట జిల్లాలోని హుస్నాబాద్, గజ్వేల్, చేర్యాలలో ఒకేసారి మోటార్ వాహనాల తనిఖీ కార్యాలయాలు ప్రారంభించారు. ఈ మూడు కార్యాలయాలకు ఇప్పటి వరకు కోడ్ నంబర్ కేటాయించలేదు. ఏ లైసెన్స్ పొందాలన్న ముందుగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. కోడ్ నంబర్ అలాట్ కాకపోవడంతో వాహనదారులు సిద్దిపేట యూనిట్ ఆఫీస్ పేరిటనే దరఖాస్తు చేసుకుంటున్నారు. నంబర్ కేటాయించినట్లయితే ఏట రోల్ ప్రారంభమై అప్పిలేట్ అధికారి నియమించబడుతారు. అన్ని రవాణా సేవలు ఇక్కడే పొందవచ్చు. ఇంకా నంబర్ కేటాయించకపోవడంతో వాహనదారులు ప్రతీదానికి సిద్దిపేటకు వెళ్లి ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. మరో వైపు లైసెన్స్‌ల కార్డుల జారీలో జాప్యం జరుగుతుంది. కార్డుల కోసం ఏడాది కాలంగా ఆఫీస్‌ల చుట్టూ తిరుగుతున్నారు.

**సొంత భవనం కరువు..**

హుస్నాబాద్ కార్యాలయానికి సొంత భవనం లేక మినీ స్టేడియంలోనే రవాణా సేవలు అందిస్తున్నారు. వారంలో రెండు రోజులు మాత్రమే ఉంటుంది. కేవలం హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ మండలాల వాహనదారులకు మాత్రమే రవాణా సేవలు అందుతున్నాయి. రెవెన్యూ డివిజన్ పరిధిలోని మొత్తం మండలాలను హుస్నాబాద్ యూనిట్ ఆఫీస్ పరిధిలోకి తీసుకురావాలని వాహనదారులు కోరుతున్నారు. మూడేళ్ల క్రితం కార్యాలయం నిర్మాణానికి ప్రభుత్వం రూ.80 లక్షలు మంజూరు చేసింది. స్థలం కొరతతో ఇప్పటి వరకు నిర్మాణం చేపట్టలేదు.



లైసెన్స్‌ల కోసం వాహనదారులు

**గతంలోనే నివేదిక ఇచ్చాం**



హుస్నాబాద్ కార్యాలయానికి కోడ్ నంబర్ కేటాయించాలని గతంలోనే ఉన్నతాధికారులకు నివేదించాం. కోడ్ నంబర్ కేటాయిస్తే అప్పిలేట్ అధికారి నియమిస్తారు. అన్ని రకాల లైసెన్స్‌లు జారీ చేసే అవకాశం ఉంటుంది. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సిద్దిపేటలో మంగళవారం నిర్వహించిన రివ్యూలో హుస్నాబాద్ యూనిట్ సేవలపై అడిగి తెలుసుకున్నారు. హుస్నాబాద్ యూనిట్‌లో పూర్తిస్థాయిలో వాహనదారులకు రవాణా సేవలు అందించాలంటే ఎలాంటి అనుమతులు కావాలో నివేదిక ఇవ్వాలని డీటీఓకు సూచించారు. రెండు, మూడు రోజుల్లో డీటీఓ నివేదికను మంత్రికి అందించనున్నారు.

– ఠాకుర్ ఈశ్వర్ సింగ్, ఎంవీఐ, హుస్నాబాద్

# చదువు సాఫీగా సాగేలా..

'అందరూ చదవాలి..అందరూ ఎదగాలి' అనే లక్ష్యంతో ముందుకెళ్తున్న ప్రభుత్వం.. బడి బయట పిల్లల గుర్తింపు సర్వేకు శ్రీకారం చుట్టింది. బడి బయట, మధ్యలో చదువు మానేసిన పిల్లలను గుర్తించడమే కార్యక్రమం లక్ష్యం. పాఠశాలలకు రాని బడీడు పిల్లలను గుర్తించి బడిలో చేర్పించేందుకు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు విద్యాశాఖ చర్యలు చేపట్టింది. సోమవారం ప్రారంభమైన సర్వే జనవరి 11 వరకు కొనసాగనుంది.

- సదాశివపేట రూరల్(సంగారెడ్డి)

- జిల్లాలో ఓఎస్‌సీ (ఔట్ ఆఫ్ స్కూల్ చిల్డ్రన్) సర్వే షురూ
- బడీడు పిల్లలను చేర్పించడమే లక్ష్యం
- విధుల్లో సీఆర్పీలు, ఐఈఆర్పీలు
- జనవరి 11 వరకు కొనసాగనున్న సర్వే



హుగ్గేలి గ్రామంలో పిల్లల వివరాలను సేకరిస్తున్న సీఆర్పీలు

జిల్లాలోని 118 మంది సీఆర్పీలు, 26 మంది ఐఈఆర్పీలు తమ కాంప్లెక్స్ పరిధిలోని గ్రామాల్లో ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నారు. ఓఎస్‌సీ (ఔట్ ఆఫ్ స్కూల్ చిల్డ్రన్) పేరిట నిర్వహించే సర్వే ద్వారా 6, 14 ఏళ్ల పిల్లలను, అదే విధంగా కళాశాల స్థాయిలో 15, 19 ఏళ్ల పిల్లలను వేర్వేరుగా గుర్తించి, వివరాలను ప్రబంద్ పోర్టల్‌లో నమోదు చేస్తున్నారు. పిల్లలు, విద్యార్థులకు అవగాహన కల్పించి పాఠశాలల్లో చేర్పించాలి. అలాగే వేరే రాష్ట్రాల నుంచి ఉపాధి కోసం ఇక్కడికొచ్చి పని చేసుకుంటున్న వారి పిల్లల వివరాలు సేకరించాలి. డ్రాప్ బాక్స్‌లోని విద్యార్థులు ప్రస్తుతం ఏ పాఠశాలలో చదువుతున్నారో సమాచారం సేకరించాలి. పక్క రాష్ట్రాల్లో ఉండి ప్రస్తుతం సొంత ప్రదేశాలకు వచ్చిన విద్యార్థులను గుర్తించాల్సి ఉంటుంది.

**ప్రతిరోజూ పర్యవేక్షణ**

జిల్లాలోని 85 పాఠశాలల కాంప్లెక్స్ పరిధిలో జరుగుతున్న సర్వేను కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, సంబంధిత గ్రామాల్లో జరుగుతున్న సర్వేను పాఠశాల హెచ్ఎం నిత్యం పర్యవేక్షించాల్సి ఉంటుంది. అలాగే మండలంలో మండల విద్యాశాఖ అధికారి ప్రతీ కాంప్లెక్స్ పరిధిలోని ఒక గ్రామంలో జరిగే సర్వేను పర్యవేక్షించి అప్పటివరకు సేకరించిన సమాచారంపై సమీక్ష నిర్వహించాలి. అలాగే జనవరి 11న మండల స్థాయి బడిబయట సర్వే రిపోర్టును జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సమర్పించాలి. జిల్లా స్థాయిలో పరిశీలించిన బడి బయట పిల్లల వివరాలను జనవరి 12న జిల్లా విద్యాశాఖ అధికారి ధ్రువీకరించి రాష్ట్రస్థాయికి పంపిస్తారు.



రుద్రారం గ్రామంలో వివరాలను సేకరిస్తున్న సీఆర్పీలు

**పకడ్బందీగా నిర్వహిస్తాం**

అందరికీ విద్య అందించాలన్నదే సర్వే లక్ష్యం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పకడ్బందీగా సర్వే నిర్వహిస్తాం. సీఆర్పీలు క్షేత్రస్థాయిలో వెళ్లి సమాచారాన్ని సేకరిస్తారు. బడీడు పిల్లల వివరాలను ప్రబంద్ పోర్టల్‌లో నమోదు చేస్తాం. జిల్లాలో నిరక్షరాస్యతను నిర్మూలించేందుకు కృషి చేస్తున్నాం. సర్వేలో గుర్తించిన పిల్లలు తిరిగి చదువుకునేలా చర్యలు తీసుకుంటాం.

– వెంకటేశ్వర్లు, జిల్లా విద్యాధికారి

# కారును ఓవర్‌టేక్ చేయబోయి..

- లారీని ఢీకొట్టిన బైక్..
- ఒకరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు



అబ్దుల్ రెహమాన్

పటాన్‌చెరు టౌన్: లారీని బైక్ ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు యువకులకి తీవ్ర గాయాలు కాగా, ఒకరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ ఘటన బీడీఎల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ శివకుమార్ కథనం ప్రకారం.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అబ్దుల్ రెహమాన్(19), ఖాసీం ఇద్దరూ బతుకుదెరువు కోసం ఏడాది కిందట వచ్చి బొల్లారం పరిధిలోని గాంధీనగర్‌లో ఉంటున్నారు. ఫాల్ సీలింగ్ వర్క్ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. గురువారం ఉదయం ఇద్దరూ పని నిమిత్తం బైక్‌పై శంకర్‌పల్లి వైపు బయలుదేరారు. ముత్తంగి సర్వీస్ రోడ్ నుంచి కర్దనూర్ వైపు వెళ్తుండగా కారును ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టారు. ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలు కాగా చికిత్స కోసం సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఇందులో చికిత్స పొందుతూ అబ్దుల్ రెహమాన్ మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్న పోలీసులు తెలిపారు.